ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

జయశంకర్ భూపాలపల్లి

బుధవారం 18 డిసెంబరు 2024

కుంభకోణం.. కలకలం

చర్చనీయాంశమైన 'పలిమెల' భూ వ్యవహారం

- రైతుల్లో తీవ్ర ఆందోళన.. దక్కన్ కంపెనీకి కట్టబెట్టడంపై ఆగ్రహం
- ఘటనపై జోరుగా పొలిటికల్ వార్
- మరో 100 ఎకరాలకుపైగా స్లాట్ బుకింగ్
- స్పందించిన కలెక్టర్.. సీసీఎల్‌కు లేఖ
- తహసీల్దార్ సస్పెన్షన్?



పలిమెల మండల కేంద్రం శివారులోని వివాదాస్పద భూమి ఇదే..

మహదేవపూర్ రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పలిమెల శివారులో కొందరు వ్యక్తుల పేర్ల మీద 102 ఎకరాల భూమిని దక్కన్ సిమెంట్ కంపెనీకి రిజిస్ట్రేషన్ చేసిన భూకుంభకోణం ఘటనపై రైతుల్లో ఆందోళన నెలకొంది. కాస్తులో ఉండి గత 50 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములను రైతుల ప్రమేయం లేకుండా కొందరు దక్కన్ సిమెంట్ కంపెనీకి రిజిస్ట్రేషన్ చేయడం చర్చనీయాం శంగా మారింది. దీనిపై అధికార పార్టీ నాయకులు రైతులతో కలిసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులు కూడా ప్రెస్‌మీట్ పెట్టి బాధ్యు లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇలా రెండు పార్టీల మధ్య పొలిటికల్ వార్ నెలకొంది.

పలిమెల మండలానికి చెందిన పలువురు రైతులు 50 ఏళ్లుగా కాస్తులో ఉండి భూములను సాగు చేసుకుంటున్నారు. ధరణి వచ్చిన తర్వాత ఈభూము లపై కన్నేసిన కొంత మంది వ్యక్తులు ధరణిలో ఎక్కించుకుని పట్టాలు పొందినట్లు తెలుస్తోంది. 2021లో ఆ వ్యక్తుల పేర్ల మీద ఉన్న భూములను ఎకరాకు రూ.2.90 లక్షలకు ఓ మధ్యవర్తి ద్వారా దక్కన్ సిమెంటు కంపెనీకి రిజిస్ట్రేషన్ చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది. ఈవిషయం తెలుసుకున్న ఓ నాయకుడు రిజిస్ట్రేషన్లకు తాను అడ్డురాకుండా రూ.20లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు సమాచారం. చివరకు ఎంతో కొంత ముట్టజెప్పడంతో ఆ నాయకుడు ప్రక్కకు తప్పుకుని బినామీ వ్యక్తులకు సహకరించినట్లు ప్రచారం జరుగుతోంది. తాజాగా పలిమెల శివారులోని సర్వే నెం.199, 165, 183, 221, 184/1, 250, 173, 251/2, 252/2, 225/1/2, 50/1, 228/2, 166, 180, 179, 172, 50, 211, 250/1, 251/3, 223, 167/1/2, 50/2, 225/1/1/2, 226/1లోని 102.35ఎకరాల భూమిని సదరు వ్యక్తుల నుంచి దక్కన్ సిమెంటు కంపెనీ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయడంతో అసలు విషయం బయటకు పొక్కింది. 102.35 ఎకరాలతో పాటు మరో 100 ఎకరాలకు సిమెంట్ కంపెనీ రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకున్నట్లు తెలిసింది. సాగు చేసే రైతుల పేర్లమీద కాకుండా బినామీ పేర్లమీద భూమి ఉండటం, ఈ నేపథ్యంలో కలెక్టర్ రాహుల్ శర్మ విచారణ ఆదేశించడంతో మిగతా రిజిస్ట్రేషన్‌కు బ్రేక్ పడినట్లయ్యింది.

తహసీల్దార్ సస్పెన్షన్?

సిమెంటు కంపెనీకి భూముల రిజిస్ట్రేషన్ విషయంలో పలిమెల తహసీల్దార్ గోప్యత పాటించడం చర్చనీయాశంగా మారింది. అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యవహారంపై కలెక్టర్ రాహుల్ శర్మ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. మంత్రి శ్రీధర్‌బాబు సైతం దీనిపై దృష్టిసారించడంతో సోమవారం అర్ధరాత్రి వరకు కలెక్టర్ రాహుల్ శర్మ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు సేకరించి తహసీల్దార్, కార్యాలయ సిబ్బంది పాత్రపై ఓ అంచానాకు వచ్చినట్లు తెలిసింది. ధరణి రిజిస్ట్రేషన్లు తహసీల్దార్ కార్యాలయంలో కాకుండా ఓ ప్రైవేటు రూంలో చేశారనే ఆరోపణలు రావడంతో తహసీల్దార్‌పై చర్యలు తీసుకునేందుకు కలెక్టర్ రాహుల్ శర్మ సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్‌కు లేఖ రాసినట్లు సమచారం. ప్రస్తుతం బుక్

మిగతా 8వ పేజీలో...

సిమెంట్ కంపెనీకి భూ రిజిస్ట్రేషన్‌పై సబ్ కలెక్టర్ విచారణ



పలిమెల రైతువేదికలో రైతులతో సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్

మహదేవపూర్ రూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి) : పలిమెల శివారులో దళిత రైతులకు చెందిన 102 ఎకరాల భూములను సిమెంట్ కంపెనీకి రిజిస్ట్రేషన్ చేశారనే ఫిర్యాదుల నేపథ్యంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ విచారణ చేపట్టారు. కలెక్టర్ రాహుల్ శర్మ సోమవారం రాత్రి విచారణకు ఆదేశించగా మంగళవారం పలిమెల రైతువేదికలో బాధిత రైతులతో సబ్ కలెక్టర్ సమావేశమయ్యారు. పలిమెల శివారులోని 27 సర్వే నెంబర్లలోని 12 మంది పేరిట ఉన్న 102 ఎకరాల భూములను సిమెంట్ కంపెనీకి తహసీల్దార్ అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని రైతులు సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. తాము 50 ఏళ్లుగా తాతాల కాలం నుంచి భూములను సాగు చేసుకుంటున్నామని వివరించారు. ఈమేరకు బాధిత రైతుల వాంగ్మూలాలను సబ్ కలెక్టర్ సేకరించారు. రిజిస్ట్రేషన్లు చేసిన వారు, చేయించుకున్నవారు ఎవరనేది తమకు తెలియదని, దీనిపై విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని రైతులు సబ్‌కలెక్టర్‌కు విన్నవించారు. ధరణికి ముందు, తర్వాత భూములు ఎవరి పేరు మీద ఉన్నాయనే రికార్డులను పరిశీలించి రైతుల నుండి వివరాలు సేకరించినట్లు సబ్‌కలెక్టర్ మయాంక్ సింగ్ ఈ సందర్భంగా తెలిపారు. రైతుల వాంగ్మూలాలతో పాటు విచారణ రిపోర్టును ఎసీఎల్ఏకు నివేదించామని తెలిపారు. భూములను రిజిస్ట్రేషన్ చేసిన తహసీల్దారుపై ఉన్నతాధికారుల ఆదేశానుసారం తదుపరి చర్యలు ఉంటాయని సబ్‌కలెక్టర్ తెలిపారు.

చలికాలం.. వ్యాధులతో బాధపడుతున్నారా?

నేటి 'ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్'లో వైద్యుడిని సంప్రదించండి



వైద్యుడు : డాక్టర్ వైద్యం గౌతం, జనరల్ ఫిజిషియన్, వరంగల్ ఎంజీఎం

సంప్రదించాల్సిన నెంబరు : 95046 16666

సమయం : బుధవారం, ఉదయం 11 నుంచి 12 గంటల వరకు

ఓ వైపు చలి పంజా విసురుతుండగా.. మరో వైపు పలు వ్యాధులు ముసురుతున్నాయి. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు.. దగ్గు, జలుబు, జ్వరంతో పాటు శ్వాస సంబంధ సమస్యలతో బాధపడుతున్నారు. ఇక ఆస్తమా, గుండె, కిడ్నీ సంబంధ సమస్యలు ఎదుర్కొంటున్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలమంది చర్మం పొడిబారడం, కీళ్ల నొప్పులు, వేళ్ల చివరన ఉబ్బడం లాంటి లక్షణాలతో సతమతమవుతున్నారు. ఈ క్రమంలో 'ఆంధ్ర జ్యోతి ఫోన్ ఇన్' ద్వారా ఎంజీఎం ఆస్పత్రికి చెందిన జనరల్ ఫిజీషియన్ డాక్టర్ వైద్యం గౌతంను సంప్రదించి చలికాలం.. వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలుసుకోవడంతో పాటు అనుమానాలను నివృత్తి చేసుకోవచ్చు.

- వరంగల్ మెడికల్, ఆంధ్రజ్యోతి

44,700 ఎకరాలకు సాగునీరు అందించాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు.

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి నియోజకవ ర్గంలోని 44,700 ఎకరాలకు సాగునీరు అందించాలని మంత్రి భట్టి విక్రమార్కకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నియో జకవర్గానికి తలాపున కాళేశ్వరం ప్రాజెక్టు ఉన్నప్పటికీ చుక్క నీరు రావడం లేదని తెలిపారు. పైగా రెండు పిల్లర్లు కుంగిపో యాయన్నారు. అలాగే దేవాదుల ప్రాజెక్టు ద్వారా డీబీఎం 38 కాల్వకు రామప్ప రిజర్వా యర్ నుంచి అనుసంధానం చేస్తే భూపాల పల్లి నియోజకవర్గంలోని చిట్యాల, గోరికొత్త పల్లి, టేకుమట్ల, రేగొండ మండలాల్లోని 44,700 ఎకరాలకు సాగునీరు అందుతుందని తె లిపారు. డీబీఎం 38 కాల్వలు 1989లో నిర్మించారని, అయినా ఇప్పటి వరకు ఈ ప్రాంతానికి చుక్కనీరు అందలేదని అన్నారు. దీనిని పునఃరుద్ధరిస్తే ఈ ప్రాంతం సస్యశ్యామలమవుతుందని తెలిపారు. అలాగే మరో 35వేల ఎకరాల గ్యాబ్ ఆయకట్టు కూడా వెంకటాపూర్, భూపాలపల్లి, తాడిచర్ల మండలాల్లో ఉందని తెలిపారు. దీని సాగు కోసం ఈఎస్ సీ ద్వారా నీరందించాలని అన్నారు. అంతేకాకుండా భూపాలపల్లి మండలంలోని గొర్లవీడు ఇందిరాసాగర్ ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేయాలని, నియోజకవ ర్గంలోని పాడైపోయిన అన్ని లిఫ్టలను సరిచేసేందుకు నిధులు ఇవ్వాలని కోరారు.

ఏకీకృత పెన్షన్ వద్దు

సీపీఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఏకీకృత పెన్షన్ విధానాన్ని అమలు చేయొద్దని సీపీఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 22న నిర్వహించనున్న కాకతీ కదనభేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఇటీవల కేంద్ర మంత్రివర్గం సీపీఎస్ విధానానికి ఆమోదం తెలిపిందని తెలిపారు. ఈ క్రమంలోనే ఈ నెల 22న వరంగల్‌లో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీనికి ఉపాధ్యాయులు వేలాదిగా తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు దిల్షాద్, నాయకులు శ్రీనివాస్, రమేష్, కోమల, చంద్రమౌళి, శైలజ, శిరీష, నయిమోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యకు కారణమైన వ్యక్తి అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ మల్లేష్.

టేకుమట్ల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అశిరెడ్డిపల్లికి చెందిన వివాహిత స్రవంతి ఆత్మహత్యకు కారణమైన మండల కేంద్రానికి చెందిన మచ్చ రాకేష్‌ను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మల్లేష్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమా వేశంలో ఆయన మాట్లాడారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. అశిరెడ్డిపల్లికి చెందిన స్రవంతికి గోరికొత్తపల్లి మండల కేంద్రానికి చెందిన సాయికుమార్‌తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అశిరెడ్డిపల్లికి చెందిన రాకేష్ తరచుగా స్రవంతిని బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడు. ఈక్రమంలో ఇటీవల గోరికొత్తపల్లికి వెళ్లి స్రవంతి ఇంటివద్ద గొడవ చేశాడు. ఆమె మామపై చేయి చేసుకున్నాడు. ఈక్రమంలో కుటుంబంలో మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈ క్రమం లో స్రవంతిని సాయికుమార్ పుట్టింటి వద్ద వదిలివెళ్లాడు. దీంతో మనస్తాపం చెందిన స్రవంతి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. స్రవంతి మృతికి రాకేష్ కారణమని తేలడంతో అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎస్సై ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యరక్ష ప్రధానం

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ



చిట్యాల గురుకులంలో భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ

చిట్యాల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతోపాటు ఆరోగ్య పరిరక్షణ ప్రధానమని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. స్థానిక బాలికల గురుకుల పాఠశాలను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. వంటగది, స్టోర్ రూం, డైనింగ్‌హాల్, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం డైట్ చార్జీలు పెంచినందున కామన్ మెనూ పక్కాగా అమలు చేయాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని అన్నారు. విద్యార్థులకు అసౌకర్యాలు కలిగితే అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు. పాఠశాల ఆవరణలో బండరాళ్లు, పిచ్చి మొక్కలు తొలగించేందుకు నిధులు మంజూరు కలెక్టర్‌ను చేయాలని ప్రిన్సిపాల్ భిక్షపతి కోరగా త్వరలోనే చదును చేయించేలా చర్యలు చేపడతామని తెలిపారు. కలెక్టర్ వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఎంపీడీవో జయశ్రీ, తహసీల్దార్ హేమ, ఎంపీవో రామకృష్ణ ఉన్నారు.

పనిచేయని ఇందిరమ్మ యాప్

ఇందిరమ్మ ఇళ్ల యాప్ పని తీరును పరిశీలించేందుకు కలెక్టర్ రాహుల్‌శర్మ మండలంలోని జడలపేటలో సిబ్బంది వద్దకు వెళ్లారు. ఈజీఎస్ టీఏలు అపర్ణ, స్రవంతి తమ సెల్‌ఫోన్లలో యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ప్రజాపాలన కార్యక్రమం దరఖాస్తుల ఆధారంగా సర్వే చేస్తున్నారు. ఈ క్రమంలో పరిశీలనకు కలెక్టర్ వచ్చిన సమయంలో సాంకేతిక సమస్యలతో యాప్ పని చేయలేదు. ఇది చూసి కలెక్టర్ అన్ని గ్రామాల్లో ఇదే సమస్య ఉందంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఎమ్మెల్యే నాయినికి ఉపసభాపతి?

- ఉమ్మడి జిల్లా నుంచి మరో కీలకపదవి
- అసెంబ్లీ, పార్టీ వ్యవహారాల్లో చురుగ్గా ఉంటున్న నేపథ్యంలో సీఎం మొగ్గు
- రాజకీయంగా క్రియాశీలకంగా ఉండే పదవి కోరుతున్న రాజేందర్‌రెడ్డి
- చీఫ్‌విప్ లేదా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోసం అధిష్ఠానంపై ఒత్తిడి
- శాసనసభ సమావేశాల ముగిసిన అనంతరమే స్పష్టత



8లో

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా రేవంత్ పాలన

మునిసిపల్ చైర్ పర్సన్ సెగ్గం వెంకటరాణి



అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందిస్తున్న మునిసిపల్ చైర్ పర్సన్ వెంకటరాణి, బీఆర్ఎస్ నాయకులు

భూపాలపల్లి కృష్ణకాలనీ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా రేవంత్ పాలన కొనసాగుతోందని భూపాలపల్లి మునిసిపల్ చైర్ పర్సన్ సెగ్గం వెంకటరాణి ఆరోపించారు. లగచర్ల ఘటనలో రైతులను అరెస్టు చేయడాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ కూడలి వద్ద ఆందోళన చేపట్టారు. అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించి వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ లగచర్ల భూ కుంభకోణంపై ఆందోళనకు దిగిన రైతుల చేతులకు బేడీలు వేసి జైల్లో వేయడం అత్యంత దారుణమన్నారు. ఆరు గ్యారెంటీలతో మోసపూరిత హామీలు ఇచ్చి ఏ ఒక్కదానినీ కాంగ్రెస్ ప్రభుత్వం సక్రమంగా అమలు చేయడం లేదని మండిపడ్డారు. ఇకనైనా నియంత పోకడకు పోకుండా ప్రజా సంక్షేమం దిశగా పనిచేయాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో జాగృతి జిల్లా అధ్యక్షుడు మాడ హరీశ్‌రెడ్డి, కౌన్సిలర్లు నూనె రాజు, ముంజంపల్లి మురళీధర్, బీఆర్ఎస్ నాయకులు సెగ్గం సిద్ధు, పోలవేణి అశోక్‌యాదవ్, కరీం, మహేందర్ యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ ఆడుతూ నిరసన



ములుగులో బతుకమ్మ ఆడుతూ నిరసన తెలుపుతున్న సర్వశిక్షా ఉద్యోగినులు

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖకు అనుబంధంగా ఉన్న సమగ్రశిక్షాలో పనిచేస్తున్న ఉద్యోగులు దిగారు. ములుగు జిల్లా కేంద్రంలోని నిరవధిక సమ్మె శిబిరం వద్ద బతుకమ్మ ఆడుతూ వినూత్న నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధి చెందడానికి క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సమగ్రశిక్షా, కేజీబీవీ ఉద్యోగులకు తక్షణమే పేస్కేల్ వర్తింపజేసి రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీనిపై అసెంబ్లీలో తీర్మానం చేసి జీవో ఇవ్వాలని, లేనట్లయితే సమ్మెను ఉధృతంగా కొనసాగిస్తామని హెచ్చరిం చారు. శిబిరంలో సంఘం ప్రధాన కార్యదర్శి సోమిడి కరుణాకర్, కోశాధికారి పాడియా కుమార్, ఉపాధ్యక్షులు ఎమ్డీ.ఫిరోజ్, సభ్యులు సుజాత, రమేష్, స్వాతి, అనిత, ప్రవీణ్, విష్ణు, తిరుమల, స్వప్నలత, ప్రవీణ్, చిరంజీవి, దేవేందర్, సుబ్బారెడ్డితోపాటు జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన కేజీబీవీ మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

ధర్మాపురంలో విగ్రహం నెలకొల్పేందుకు కృషి ..

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


దర్గ్యానాయక్ మృతదేహానికి పూలమాల వేస్తున్న ఎర్రబెల్లి

దర్గ్యానాయక్ గొప్ప మహానుభావుడని, తాను అప్పుడప్పుడూ కలిసి ఆయన ఆశీర్వాదం తీసు కుంటాననీ, ఆయన విగ్రహం ధర్మాపురంలో, లేదా దేవరుప్పులలో నెలకొల్పుతానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. అంతేకాకుండా చరిత్రలో ఆయన పేరు నిలిచేం దుకు ఏదైనా వర్సిటీకి దర్గ్యానాయక్ పేరు పెట్టించేలా ప్రభుత్వంతో పోరాటం చేస్తానన్నారు. దేశ్‌ముఖ్, ఆయన గుండాలపై నిప్పుకనికలాగా పోరాటం సాగించారన్నారు. ధర్మాపురం ప్రాం తంలోని గిరిజన మహిళలకు తన కోడలు పూలమ్మతో పాటు ఆయన అండగా నిలిచా డన్నారు. ఆయన పోరాటం చాలా గొప్పదని ఆరోజుల్లో భూమి, భుక్తి, విముక్తి కోసం పోరు సలిపారన్నారు. పోరాటయోధుల చరిత్రను గొప్పగా చెప్పుకునేలా కృషి చేస్తానని, పాల కుర్తిలోని మార్కెట్ యార్డుకు చాకలి అయిలమ్మ నామకరణం తానే చేయించానని చెప్పారు.

దర్గ్యానాయక్ చరిత్ర ఈ తరానికి తెలియజేస్తా..

పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి

పోరాట పటిమ కలిగిన పాలకుర్తి ప్రాంత చరిత్రను ఈ తరం వారికి తెలిసేలా కృషి చేస్తానని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి అన్నారు. చాకలి ఐలమ్మ, రానూనాయక్, పూలమ్మ, దర్గ్యానాయక్, దొడ్డి కొమురయ్య, షేక్ బందగీ వంటి ఎంతో మంది సాయుధ పోరాటంలో పోరు సల్పిన మహానుభావులని కొనియాడారు. వారి చరిత్ర నేటి తరాలనికి తెలిసే విధంగా ప్రభుత్వం దృషికి తీసుకెళ్తానన్నారు. నిజాం నవాబు, దేశ్‌ముఖ్‌ల పాలన అంతమొందేందుకు ఎంతో మంది త్యాగాలు చేశారన్నారు. త్యాగాలు చేసిన వీరుల గురించి చరిత్ర చెప్పుకునే విధంగా ప్రయత్నిస్తానన్నారు.

దర్గ్యానాయక్‌కు కన్నీటి వీడ్కోలు

- విప్లవ జోహార్లు అర్పించిన కమ్యూనిస్టులు
- నివాళులర్పించిన ప్రముఖులు
- శోకసంద్రమైన జాటోతుతండా


జాటోతుతండా నుంచి ధర్మాపురం మీదుగా సాగిన దర్గ్యానాయక్ అంతిమయాత్రకు హాజరైన బంధువులు, ప్రజలు

దేవరుప్పుల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి సజీవ సాక్షి అయిన 107సంవత్సరాల జాటోతు దర్గ్యానాయక్‌కు మంగళవారం స్వగ్రామమైన జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గంలోని జాటోతుతండాలో కుటుంబసభ్యులు, ప్రజలు, కమ్యూనిస్టు నేతలు, కవులు, కళాకారులు, విప్లవకారులు, ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నేతలు, అధికారులు కన్నీటివీడ్కోలు పలికారు. ధర్మాపురం జాటోతుతండాలో శాంతించిన సముద్రమోలే కనిపించే సమరయోధుడు సోమవారం సాయంత్రం తుదిశ్వాస విడిచాడు. దర్గ్యానాయక్ భౌతికకాయానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, వ్యవసాయ కార్మిక సంఘం ఆలిండియా ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు ధర్మానాయక్, రైతు సంఘం రాష్ట్ర నాయులు శోభాన్ నాయక్, జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, కార్యదర్శి వర్గసభ్యులు సాంబరాజు యాదగిరి, సీపీఐ జిల్లా కార్య దర్శి, జనగామ మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి ఆదిసాయన్న, మహిళా సంఘం జిల్లా సభ్యురాలు నల్ల అరుణ, రైతు సంఘం నాయకులు బిల్లా తిరుపతిరెడ్డి, సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ కార్యదర్శి మామిండ్ల రమేష్‌రాజా, రాష్ట్ర కమిటీ సభ్యులు గుమ్మడిరాజుల సాంబయ్య, అనంతోజు రజిత, జీడి సోమయ్య, రాష్ట్రమాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు పల్లా సుందర్‌రామ్‌రెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి, పీసీసీ సభ్యులు లకావత్ లక్ష్మీనారాయణ, జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్, మహబూబాబాద్ మాజీ ఎంపీ సీతారామ్‌నాయక్, వీరనారి చాకలి ఐలమ్మ వారసుడు, తెలంగాణ తల్లి ఐలమ్మ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చిట్యాల యాకయ్య పూలమాలలు వేసి విప్లవ జోహార్లు, నివాళులర్పించారు. మధ్యాహ్నం 2గంటలకు ప్రారంభమైన అంతిమయాత్ర జాటోతుతండా నుంచి ధర్మాపురం మీదుగా రెండు గంటలపాటు కొనసాగింది.

ఈ అంతి మ యాత్రలో డప్పువాయిద్యాలు, కళాకారుల ఆట పాటలు, అనేక మంది ప్రముఖులు, ప్రజలు, విప్లవకారులు పాల్గొనగా, దర్గ్యానాయక్ వ్యవసాయ భూమిలోనే దహన సంస్కారాలు పూర్తి చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సింగరాపు రమేష్, రాపర్తి రాజు, ఇర్రి అహల్య బొట్ల శేఖర్, బూడిద గోపి, చిట్యాల సోమన్న, జోగు ప్రకాష్, ఇంటి వెంకట్‌రెడ్డి, మాచర్ల సారయ్య, ఏదునూరి మదార్, సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు సొప్పరి సోమయ్య, మండల కార్యదర్శి జీడి ఎల్లయ్య, బెజుగం ఎల్లయ్య, బాషిపాక సోమయ్య, బీఆర్‌ఎస్ నాయకులు బస్వ మల్లేశం, చింత రవి, అనంతోజు కృష్ణమూర్తి, గండిపెల్లి యాకయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నల్ల శ్రీరాములు, తోటకూరి పాండు కృష్ణ పాల్గొన్నారు.

దళ కమాండర్‌గా ఎదిగి.. గిరిజనులను చైతన్య పర్చి

- దర్గ్యానాయక్ ఆశయాలను కొనసాగించాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

దేవరుప్పుల (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో దేశ్‌ముఖ్ ఆగడాలను తిప్పి కొట్టేందుకు దళ కమాండర్‌గా దర్గ్యానాయక్ ఎదిగాడని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. దేవరుప్పుల మండలం ధర్మాపురం పరిధి జాటోతుతండాకు చెందిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు జాటోతు దర్గ్యానాయక్ (107) మంగళవారం జాటోతు తండాకు వచ్చిన వీరభద్రం ఆయనకు విప్లవ జోహార్లు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ దేశ్‌ముఖ్ ఆగడాలు గిరిజన ప్రాంత మహిళలపై అఘాయిత్యాలు, చిత్రహింసలు మితిమీరి పోవటంతో తిప్పికొట్టే విధంగా మహిళలను చైతన్య పర్చిన మహానుభావుడు దర్గ్యానాయక్ అని కొనియాడారు. రైతాంగ సాయుధ పోరాటానికి పిరంగిలా ఎదురు నిల్చిన దేశ్‌ముఖ్‌తోపాటు గుండాలను తరిమి కొట్టిన ధీరుడన్నారు. జాటోతుతండాలో 10 మందిని సజీవదహనం చేసినప్పటికీ జంకకుండా సాయుధ పోరులో కీలక భూమిక పోషించాడన్నారు. విస్నూర్ దేశ్‌ముఖ్ కుమారుడు జగన్మోహన్‌రెడ్డిని జనగామ రైల్వే స్టేషన్‌లో నరికి చంపిన గొప్ప వీరుడు అని అన్నారు. దర్గ్యానాయక్ పోరాట పటిమను నేటి యువత స్ఫూర్తిగా తీసుకొని ఆయన ఆశయాలను కొనసాగించాలన్నారు.

సాయుధ పోరులో దర్గ్యానాయక్ సింహస్వప్నం

సీపీఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే రాజారెడ్డి


తెలంగాణ రైతాంగ సాయుధ పోరులో సింహస్వప్నంలా దర్గ్యానాయక్ నిలిచాడని సీపీఐ జిల్లా కార్యదర్శి, జనగామ మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి అన్నారు. నాడు గిరిజన మహిళలను దేశ్‌ముఖ్ గుండాలు ఇబ్బంది పెడుతుంటే ధర్మాపురం గిరిజన మహిళలు పూలమ్మ నాయకత్వంలో రోకలి బండలు, కారంపొడి చల్లి తమ మాన, ప్రాణాలను కాపాడుకున్నారన్నారు. అందుకు దర్గ్యానాయక్ చైతన్యపర్చడం వల్లే మహిళలు ముందుకు వచ్చారన్నారు. నల్లా నర్సింహులుతో దర్గ్యానాయక్ కలిసి దళాలుగా ఏర్పడి దేశ్‌ముఖ్ గుండాలను మట్టు పెట్టారన్నారు.

భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం

సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా

భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా దోపిడీ పీడన పోవాలని ఎర్రజెండా నాయకత్వంలో అనేక పోరాటాలకు దర్గ్యానాయక్ కుటుంబం నాయకత్వం వహించిందన్నారు. తన అన్న రానూనాయక్‌తో పాటు, తన కోడలు పూలమ్మ, దర్గ్యానాయక్ తండ్రి హామూనాయక్ ఆయన ఆరుగురు కుమారులు యుద్ధవీరులుగా పోరాటం చేశారన్నారు. ఆ కుటుంబం చేసిన పోరాటంతో దేశ్‌ముఖ్ దొరకు లాగు తడిపించారన్నారు. దర్గ్యానాయక్ కుటుంబం అంతా త్యాగ ధనులేననీ, వీరోచితంగా పోరాడినవారేనన్నారు. 107ఏళ్ల వయస్సులో ఆ మహావీరుడు తుదిశ్వాస విడువటం విప్లవ శ్రేణులకు విషాదం మిగిల్చిందన్నారు.


కొశెట్టివాయిలో గ్రామస్థుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న డీఎఫ్‌వో


చౌలేడు గుట్టల్లోని వాగులో పెద్దపులి పాదముద్రలు

పెద్దపులి కోసం వెతుకులాట

డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్, ఫారెస్టు అధికారుల అన్వేషణ

తాడ్వాయి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఐదురోజులుగా ములుగు జిల్లా తాడ్వాయి, మంగపేట, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం, గుండాల సరిహద్దు మండలాల అటవీ ప్రాంతంలో తిరుగుతున్న పెద్దపులి ఆచూకీ కోసం ఫారెస్టు అధికారులు అన్వేషిస్తున్నారు. తాడ్వాయి మండలంలోని పంబాపూర్, నర్సాపూర్ వాగుల్లోని ఇసుక దిబ్బలపై పెద్దపులి పాదముద్రలు సోమవారం కనిపించాయి. దీంతో అప్రమత్తమైన ఫారెస్టు అధికారులు మంగళవారం నర్సాపూర్ వాగువెంట, చౌలేడు గుట్టలు, కొశెట్టివాయి అడవులతోపాటు సరిహద్దు అటవీ గ్రామాల్లో పెద్దపులి జాడ కోసం స్థానికులను అడిగి తెలుసుకుంటున్నారు. అంతేకాకుండా ములుగు డీఎఫ్‌వో రాహుల్ కిషన్‌జాదవ్ ఆధ్వర్యంలో స్థానిక ఫారెస్టు అధికారులు మ్యాపులతో వారికి కేటాయించిన సెక్షన్ల ప్రాంతంలో ముమ్మంగా పరిశీలన చేపట్టారు. చౌలేడు గుట్టల్లోని వాగులో పెద్దపులి పాదముద్రలను సేకరించారు. అయితే పెద్దపులి నీళ్ల ఉండే ప్రదేశాల్లో తిరుగుతున్నట్లు గుర్తించారు. ఏది ఏమైనప్పటికీ అటవీ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

లగచర్ల తరహా కుంభకోణం


- దక్కన్ సిమెంట్ కంపెనీకి భూముల రిజిస్ట్రేషన్లు
- మంత్రి శ్రీధర్‌బాబుపై పుట్ట మధు ఆరోపణ
- విచారణ జరిపించాలని డిమాండ్


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న పుట్ట మధు ←

మహదేవపూర్ రూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి) : లగచర్ల తరహాలో భూపాలపల్లి జిల్లా పలిమెల మండలంలో భూ కుంభకోణం జరిగిందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆరోపించారు. మండల కేంద్రం శివారులోని 200 ఎకరాల దళిత, పేద వర్గాల భూములను దక్కన్ సిమెంటు కంపెనీకి అక్రమంగా కట్టబెట్టారని విమర్శించారు. మంత్రి శ్రీధర్‌బాబు తన తమ్ముడికి దక్కన్ సిమెంటు కంపెనీలో 50 శాతం వాటా కోసం బినామీ పేర్ల మీద ఉన్న ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపించారు. మంగళవారం ఆయన పలిమెలలో మీడియాతో మాట్లాడారు. 50 ఏళ్లుగా కాస్తులో ఉన్న రైతులకు సమాచారం ఇవ్వకుండా ఎలాంటి సంబంధం లేని కమాలొద్దీన్ అనే వ్యక్తి ద్వారా వనం రాంచందర్‌రావు, సదానందంతోపాటు మరో 30 మంది కాంగ్రెస్ నాయకులు 2008లో రిజిస్ట్రేషన్ చేసినట్టు తెలిపారు.

ధరణి స్థానంలో కొత్తగా భూమాత పోర్టల్ రానున్న నేపథ్యంలో సాంకేతికంగా ఇబ్బంది అవుతుందని భావించి ఆ భూములను దక్కన్ సిమెంటు కంపెనీ పేరు మీద మార్చే ప్రయత్నం జరిగిందని మధు ఆరోపించారు. తహశీల్దార్ కార్యాలయంలో కాకుండా ఓ రహస్య ప్రదేశంలో ఆ భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగించి భారీ కుంభకోణానికి పాల్పడ్డారని అన్నారు. శ్రీధర్‌బాబు పరిశ్రమల శాఖ మంత్రి కావడంతో అధికారాన్ని అడ్డుపెట్టుకొని రైతులను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఈ వ్యవహారంలో తహసీల్దార్ కీలక పాత్ర పోషించారని ఆరోపించారు. కుంభకోణం విషయం బయటకు రావడంతో దీనిపై విచారణ అధికారిగా ఆయన్నే నియమించడం విడ్డూరమన్నారు. ఈ భూములకు సంబంధించి రైతులకు తాత పట్టా పాసుబుక్కులు ఉన్నప్పటికి వరదలు, ఇతర ప్రమాదాలతో వాటిని కోల్పోయారని అన్నారు. దీనిని ఆసరాగా చేసుకుని మంత్రి శ్రీధర్‌బాబు చక్రం తిప్పుతున్నారని ఆరోపించారు.

లగచర్ల తరహా ఈ కుంభకోణం జరిగిందని, ఎస్సీ, ఎస్టీ భూములను లాక్కు నేందుకు మంత్రి శ్రీధర్‌బాబు ప్రయత్నిస్తున్నారని ఆరోనింయాకె, దక్కన్ సిమెంటు కంపెనీకి చేసిన రిజిస్ట్రేషన్లు వెంటనే రద్దు చేసి ఆభూములను రైతుల పేర్ల మీదకు ఎక్కించాలని డిమాండ్ చేశారు. మధు వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జవ్వాజి తిరుపతి, శ్రీనివాసరావు, నాయకులు కేదారి గీతాబాయి, జక్కు రాకేష్, అలీం ఖాన్, అన్కారి ప్రకాశ్ తదితరులు ఉన్నారు.



బొగతలో పర్యాటకుల సందడి

వాజేడు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వాజేడు మండలంలోని చీకుపల్లి అటవీ ప్రాంతంలో ఉన్న బొగత జలపాతం వద్ద మంగళవారం పర్యా టకులు సందడి చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులు జలపాతం వద్ద ఆహ్లాదంగా గడిపారు. జలపాతం నుంచి జలధారలు కాస్త తగ్గాయి. అయినా ఉన్న కాస్తంత జలధారలను చూసి పర్యాటకులు మైమరిసిపోయారు. జలపాతం ముందు భాగంలో ఉన్న ఈత కొలనులో జలకాలాడుతూ కేరింతలు కొట్టారు. సరదాగా సెల్ఫీలు దిగుతూ మధుర క్షణాలను సెల్‌ఫోన్లలో బంధించారు.

సజావుగా గ్రూప్-2 పరీక్ష

జనగామ రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రూప్-2 పరీక్షలు సజావుగా జరిగాయని అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలోని స్ట్రాంగ్ రూంలో భద్రపరిచిన ఓఎంఆర్ జవాబు పత్రాలను పోలీసుల పర్యవేక్షణలో మంగళవారం ప్రభుత్వ వాహనంలో ఎక్కించి సీల్‌చేసి కట్టుదిట్టమైన భద్రత చర్యల నడుమ హైదరాబాద్‌లోని టీజీపీఎస్సీ కార్యాలయానికి తరలించారు. కార్యక్రమంలో ఆర్డీవో గోపిరాం, ఏసీపీ పార్థసారథి, రీజనల్ కో-ఆర్డినేటర్ నర్సయ్య, అధికారులు పాల్గొన్నారు.


గ్రూప్-2 జవాబు పత్రాలను టీజీపీఎస్సీ ఆఫీస్‌కు తరలిస్తున్న అధికారులు


రైతుకు వరి మినీ కిట్‌లను అందజేస్తున్న ఏడీఏ శ్రీనివాసరావు

రైతులకు వరి విత్తనాల పంపిణీ

మహబూబాబాద్ అగ్రికల్చర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులకు వరి మినీ కిట్ విత్తనాలను వ్యవసాయ మహబూబాబాద్ డివిజన్ సహాయ సంచాలకుడు అజ్మీర శ్రీనివాసరావు పంపిణీ చేశారు. మహబూబాబాద్‌లోని రైతు వేదికలో మంగళవారం ఈ వరి మినీ కిట్స్ విత్తనాలను పంపిణీ చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విద్యాలయం నుంచి విడుదలైన చీడపీడల నుంచి తట్టుకునే రకాలైన ఆర్ఎన్ఆర్ 31479, ఆర్ఎన్ఆర్ 35008 అధిక దిగుబడి ఇచ్చే రకాలను మినీ కిట్స్‌ను రైతులకు అందజేశారు. 4 కేజీల సంచులను వ్యవసాయాధికారులు పరిశీలించిన తర్వాత రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎన్.తిరుపతిరెడ్డి, ఏఈవో సాయిప్రకాష్ పాల్గొన్నారు.

అధ్యాపకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఫార్మసీ మహిళా కళాశాలలో అతిథిఅధ్యాపకుల నియామకాల కోసం అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ స్వప్నరెడ్డి మంగళవారం తెలిపారు. బి.ఫార్మసీ కళాశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి ఫార్మస్యూటిక్స్ (1), ఫార్మకాలజీ (1), ఫార్మకెమిస్ట్రీ (1) సబ్జెక్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. అభ్యర్థులు అర్హతగల సర్టిఫికెట్లు బి. ఫార్మసీ, ఎం. ఫార్మసీ మరియు సర్వీస్ సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 21 సాయంత్రం 4 గంటలలోపు కళాశాల కార్యాలయంలో అందజేయాలన్నారు.

కోటంచ హుండీ ఆదాయం రూ. 8,92,021

రేగొండ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని కోటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీని మంగళవారం లెక్కించారు. ఆలయానికి నాలుగు నెలల ఆదాయం రూ. 8,92,021 సమకూరింది. దేవాదాయ పరిశీలకురాలు కవిత, ఆలయ ఈవో మహేష్, అర్చకులు బుచ్చమాచార్యులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

మానుకోటలో జీపీ కార్మికుల ముందస్తు అరెస్టు



పోలీసులు అరెస్ట్ చేసిన జీపీ కార్మికులు

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా సోమవారం రాత్రి 10 గంటల నుంచి ఆయా గ్రామాల పరిధిలోని జీపీ కార్మికులను హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద జరిగే సభకు తరలివెళ్లకుండా పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి, ఆయా పోలీస్‌స్టేషన్లకు తరలించారు. అనంతరం సొంతపూచీకత్తుపై మంగళవారం సాయంత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా గ్రామపంచాయతీ వర్కింగ్ ప్రెసిడెంట్ ధర్మారపు సుధాకర్ మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులు హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద జరిగే ధర్నాకు వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడం సరికాదన్నారు. మల్టీపర్పస్ విధానం రద్దు, పెరిగిన ధరలకనుగుణంగా రూ.26 వేల వేతనం, కారోబార్, బిల్‌కలెక్టర్లకు పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతులు కల్పించాలన్నారు. జీవో నెంబర్ 51ని సవరించాలనే డిమాండ్ చేశారు. మహబూబాబాద్ రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో అశోక్, మల్సూర్, వెంకన్న, విష్ణు, భద్రు ఉన్నారు.

వివిధ మండలాల్లో..

తొర్రూరు మండల పరిధిలోని అన్ని గ్రామాల జీపీ కార్మికులు కొత్తపల్లి రవి, వీరన్న, బీకు, యాకయ్య, వెంకన్నలను అరెస్టు చేసి తొర్రూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

- దంతాలపల్లిలోని పలు గ్రామాల జీపీ కార్మికులు డోనికెన కర్లం, యాకన్న, కిట్టునాయక్, వెంకన్నలను ముందస్తు అరెస్టు చేసి దంతాలపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.
- పెద్దవంగర మండలంలోని జీపీ కార్మికులు కుమారస్వామి, సోమనర్సయ్య, ఎల్లమ్మ, యాకయ్య, అశోక్‌లను ముందస్తుగా అరెస్టు పెద్దవంగర పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.
- డోర్నకల్ మండలంలోని అన్ని గ్రామపంచాయతీ కార్మికులు అన్వేష్, దాసు, రాములు, రవి, వెంకన్న, ఉపేందర్, రమేష్‌లతో పాటు పలువురిని అరెస్టు చేసి డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.
- కొత్తగూడ మండలంలోని అన్ని గ్రామాల జీపీ కార్మికులు బాలియా శంకర్, రవి, యాకన్న ముందస్తు అరెస్టు చేసి కొత్తగూడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.
- బయ్యారం మండలంలోని ఆయా గ్రామాల జీపీ కార్మికులు ఆదిశేషులు, చంద్రమౌళి, వెంకన్న, రోహిత్, వెంకట్‌రెడ్డిలను ముందస్తు అరెస్టు చేసి బయ్యారం పోలీస్‌స్టేషన్ తరలించారు.
- కేసముద్రం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన జీపీ కార్మికులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జీపీ కార్మికుల సంఘం మండల అధ్యక్షులు జాటోతు మంగీలాల్, చుంచు కొమురయ్య ,బొల్ల రాములు, ఉమాప్రసాద్, దర్గయ్య, యాకమ్మ, సోమక్క, పార్వతమ్మలు ఉన్నారు.

దొడ్డి కొమురయ్య చరిత్ర

యువతకు ఆదర్శం : విమలక్క


కొమురయ్య సినిమా పోస్టర్ ఆవిష్కరిస్తున్న విమలక్క, చిత్ర బృందం

జనగామ రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): దొడ్డి కొమురయ్య చరిత్ర యువతకు ఆదర్శమని, ఆయన స్ఫూర్తితో స్వరాష్ట్రం సాధించుకోవడం జరిగిందని అరుణోదయ నాట్య మండలి కళాకారి విమలక్క అన్నారు. దొడ్డి కొమురయ్య సినిమా పోస్టర్‌ను మంగళవారం జిల్లా కేంద్రంలో ఆమె ఆవిష్కరించారు. అనంతరం చిత్ర యూనిట్, కుర్మ సంఘ నాయకులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. కొంరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

విమలక్క, కరీంనగర్ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమా మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో కొమురయ్య చేసిన సేవలు మరువలేని, ఆయన స్ఫూర్తితోనే తెలంగాణ సాధించుకోవడం జరిగిందన్నారు. డైరెక్టర్ సేనాపతి మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నేలరాలిన తొలి రక్తపు చుక్క కొమురయ్య అన్నారు. తెలంగాణ ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం అమరుడైన దొడ్డి కొమురయ్య జీవిత చరిత్ర ఆధారంగా సినిమాను నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో దొడ్డి భిక్షపతి, బాల్దే మల్లేషం, కర్రె శ్రీనివాస్, గోరిగె నర్సింహులు, జాయ మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

డోర్నకల్‌లో జాతీయ పెన్షనర్స్ డే

డోర్నకల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జాతీయ పెన్షనర్స్ డే సందర్భంగా డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలో రైల్వే విశ్రాంత ఉద్యోగులు డీఎస్ నకారే చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా రైల్వే విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు రజాలీ మాట్లాడుతూ.. నకారే చేసిన పోరాటం ద్వారానే సుప్రీం కోర్టు పదవీవిరమణ పొందిన ప్రతి ఉద్యోగికి పెన్షన్ పొందే హక్కు కల్పించిందన్నారు. పెన్షన్ అనేది ప్రతి ఉద్యోగి ప్రాథమిక హక్కు అని, ఇది ప్రభుత్వ దయా, దాక్షిణాల మీద ఆధారపడి ఉండదని చెప్పారు. ఈ కార్యక్రమంలో వెంకటనారాయణరెడ్డి, బెల్లి సర్వయ్య, ఎల్లేష్, సీతారాములు, చారీ, వెంకటేశ్వర్లు, వీరయ్య, ఈసూఫ్ పాల్గొన్నారు. పెన్షనర్స్ డే సందర్భంగా డోర్నకల్ మునిసిపల్ చైర్మన్ వీరన్న, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సుమీర్‌చంద్‌జైన్ విశ్రాంత ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు.

పల్లెపై చలి చిత్రం


మంచు దుప్పటి మనుగొండ గ్రామం


గీసుగొండ వద్ద తాటిచెట్టు తొర్రలో నుంచి నక్కి చూస్తున్న గుడ్లగూబలు


మంచు దుప్పటిలోనే పొలం పనుల్లో నిమగ్నమైన ఓ రైతు


గీసుగొండలో చలి మంట వద్ద ఉపశమనం పొందుతున్న కుటుంబం


మనుగొండ గ్రామంలో చలిమంట కాగుతున్న స్థానికులు

చలి పంజా విసురుతోంది. రోజురోజుకు రాత్రి ఉష్ణోగ్రతలు కనిష్ఠానికి పడిపోతున్నాయి. రోజంతా చల్లని గాలులు వీస్తున్నాయి. సాయంత్రం నుంచి తెల్లవారుజాము వరకు పొగమంచు కురుస్తోంది. ఈ క్రమంలో పక్షులు గూళ్లు దాటి బయటకు రావడం లేదు. వృద్ధుల నుంచి చిన్నారుల వరకు చలిమంటలను ఆశ్రయిస్తున్నారు. పల్లెల్లో అయితే రైతులు, వ్యవసాయ, ఇతర కూలీ పనులకు వెళ్లేవారు గజగజ వణుకుతూనే రోజువారీ పనుల్లో నిమగ్నమవుతున్నారు. మంగళవారం వరంగల్ జిల్లా గీసుగొండ, మనుగొండ, ఎలుకుర్తి సమీప ప్రాంతాల్లో కనిపించిన చలి చిత్రాలివీ.

ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ

జూపార్కుకు రెండు అడవి దున్నలు..

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): హనుమకొండ హంటర్‌రోడ్‌లోని కాకతీయ జులాజికల్ పార్కుకు సోమవారం అర్ధరాత్రి రెండు అడవి దున్నల జంట వచ్చింది. 5 యేళ్ల అనిత, 4 ఏళ్ల శివను జిల్లా అటవీ శాఖ అధికారులు హైదరాబాద్‌లోని నెహ్రూ జులాజికల్ పార్కు నుంచి తీసుకువచ్చారు. ఇప్పటికే అడవి దున్నలకు జూపార్కులో ఎన్‌క్లోజర్ ఏర్పాటు చేయగా, అందులో ఈ అడవి దున్నలను ఉంచారు. ఆడ అడవి దున్న ప్రస్తుతం గర్భంతో ఉందని జిల్లా అటవీశాఖ అధికారి లావణ్య తెలిపారు. అలాగే మరి కొన్ని రోజుల్లో రెండు తెల్లపుల్లులు, ఒక సింహం కూడా జూపార్కుకు రానుంది. దీంతో జూపార్కుకు సందర్శకుల తాకిడి పెరిగే అవకాశం ఉంది.


జూపార్కుకు వచ్చిన అడవి దున్నలు

మీ సేవలకు యాప్

అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం

- నష్టపోనున్న ఉమ్మడి జిల్లాలోని 623 మీసేవ సెంటర్ల నిర్వాహకులు
- అమలు చేయొద్దని ప్రభుత్వానికి వినతులు

ఉమ్మడి జిల్లాలో మీ సేవ సెంటర్లు ఇలా
హనుమకొండ- 140
వరంగల్- 125
జనగామ- 70
మహబూబాబాద్- 141
భూపాలపల్లి- 96
ములుగు- 51

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఇటీవల మీ సేవ యాప్‌ను అందు బాటులోకి తెచ్చింది. ఈ యాప్ పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తే ప్రజలకు అరచేతిలో సమాచారం ఉంటుంది. కానీ దీనిని వినియోగించుకునే అవగాహ న అందరికీ ఉంటుందా ఉండదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ శాఖలకు సంబంధించిన పత్రాలు అప్‌లోడ్ చేయడం కొందరు ప్రజలకు తెలియక దళారులను ఆశ్రయించే అవకాశం ఉంది. ఈ క్రమంలో మీ సేవ నిర్వాహకులు నష్టపోతారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా మీ సేవ సెంటర్లు 2011 సంవత్సరంలో అమలులోకి రాగా అప్పటి నుంచి మీ సేవ సెంటర్ల ద్వారా ప్రజలకు కావాల్సిన అన్ని సౌకర్యాలు లభిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల నూతన మీ సేవ యాప్ అమలులోకి తీసుకురావడంతో తమకు తీవ్ర నష్టం జరుగుతుందని మీసేవ నిర్వాహకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో ప్రభుత్వం ఆ యాప్‌ను తాత్కాలికంగా ఆపేశారు. ప్రభుత్వం తీసుకొచ్చే కొత్త సర్వీసు వల్ల మీ సేవలను నిర్లక్ష్యం చేయడమే కాకుండా కొన్ని సేవలను మీ సేవ ద్వారా ప్రజలకు అందించే అవకాశం కూడా పోతోంది.

నష్టపోనున్న మీసేవ సెంటర్ల నిర్వాహకులు

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 623 మీ సేవ సెంటర్లు ఉన్నాయి. కొత్త యాప్ పూర్తిస్థాయిలో అమలులోకి వస్తే ఈ సెంటర్ల నిర్వాహకులు నష్టపోయే అవకాశాలున్నాయి. ప్రభుత్వ సేవలతో పాటు ప్రజలకు కావాల్సిన సర్టిఫికెట్లు మీ సేవ సెంటర్ల ద్వారా సులువుగా పొందే అవకాశం ఉందని, ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త విధానం వల్ల అవగాహన లేని ప్రజలు దళారులను ఆశ్రయించి మోసపోయే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



హనుమకొండ చౌరస్తాలో ఉన్న మీ సేవ సెంటర్

కొత్త యాప్‌తో తీవ్రంగా నష్టపోతాం



ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన మీసేవ యాప్ వల్ల మీసేవ సెంటర్ల నిర్వాహకులు తీవ్రంగా నష్టపోతారు. ఈ యాప్‌ను ఎలా వినియోగించాలో తెలియక ప్రజలు దళారులను ఆశ్రయించే అవకాశం ఉంటుంది. తద్వారా అటు ప్రజలు.. ఇటు మేం నష్టపోతాం. ప్రజలకు కావాల్సిన సర్టిఫికెట్లు, ప్రభుత్వానికి సంబంధించిన పనులు మీ సేవల వల్ల సులభంగా అందుతున్నాయి. యాప్ అమలుపై ప్రభుత్వం పునరాలోచించాలి.

- రావిపాటి దేవేందర్‌రావు, మీసేవ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

వాట్సాప్‌లోనూ వినియోగదారుల కమిషన్‌కు ఫిర్యాదు చేయొచ్చు

బాలసముద్రం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రస్తుతం వాట్సాప్‌లో కూడా వినియోగదారుల కమిషన్‌కు ఫిర్యాదు చేయవచ్చని ఆల్ ఇండియా కన్స్యూమర్స్ కౌన్సిల్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా వినియోగదారుల సలహా సంఘం ఏర్పాటు చేసిన వినియోగదారుల చైతన్య సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. డిసెంబరు 24 జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశ వ్యాప్తంగా 7 రోజుల పాటు ఈ నెల 18 నుంచి 24 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరకు వస్తువులు విక్రయించినా, నాసిరకం ఉత్పత్తులు అంటగట్టి సేవా లోపానికి పాల్పడినా ఇక నుంచి వినియోగదారులు ఇంటి నుంచే కమిషన్‌కు ఫిర్యాదు చేయవచ్చని ఆయన తెలిపారు. కేంద్ర వినియోగదారుల మంత్రిత్వ శాఖ అందుకోసం వాట్సాప్ సేవలను తీసుకొచ్చిందని దామోదర్ వివరించారు.

వాట్సాప్ నంబర్ : 88000 01915 లో మొదట హాయ్ అని టైప్ చేయాలని అందులో వచ్చే సూచనల ఆధారంగా వివరాలు నమోదు చేస్తే జాతీయ వినియోగదారుల కమిషన్ హెల్ప్ లైన్‌లో ఫిర్యాదు నమోదవుతుందని తెలిపారు. అనంతరం కేసు పరిష్కారం కోసం ఆవివరాలను ఆయా జిల్లా వినియోగదారుల కమిషన్‌కు పంపుతారని ఆయన పేర్కొన్నారు. కేసు పరిష్కారం అయ్యే వరకు అవసరమైన సలహాలు, సూచనలు కూడా అందిస్తారన్నారు. దీంతో పాటు 1800114000 లేదా 1915కు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. సమావేశంలో వినియోగదారుల సలహా సంఘం సభ్యులు ప్రముఖ న్యాయవాది మల్యాల మనోహర్‌రావు, కవిరాజ్, ఇందిర, జోష్న, సతీష్, నరేష్, మంజుల తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పల్లెపాడు దామోదర్

హద్దు దాటొద్దు..

- సోషల్ మీడియాతో జాగ్రత్తలు అవసరం
- తప్పుడు పోస్టులు చేస్తే చర్యలు తప్పవు



వర్ధన్నపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ ఫోన్లు వినియోగించే వారంతా దాదాపు సోషల్ మీడియా వినియోగిస్తూనే ఉంటారు. అయితే ఫేస్‌బుక్, వాట్సాప్ లాంటి వాటిల్లో పంపే సందేశాలు ఏమాత్రం అటుఇటు అయినా కటకటాల పాలుకావాల్సి వస్తుంది. అభ్యంతరకరమైన సందేశాలు మనకు వస్తే వాటిని మరొకరికి ఫార్వర్డ్ చేసినా తప్పే. అందుకే సందేశాలు పంపే ముందు ఫార్వర్డ్ చేసే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. సోషల్ మీడియాలో వాట్సప్‌కు ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. స్మార్ట్ ఫోన్ ఉన్న ప్రతీ ఒక్కరు ఈ యాప్ వాడు తున్నారు. సంక్షిప్త సందేశాలు మాత్రమే కాకుం డా నిర్ణీత పరిమాణంలో ఉన్న వాయిస్ ఫొటో లు, వీడియో ఫైల్స్ కూడా మార్పిడి చేసుకునే అవకాశం ఈ యాప్‌లో ఉంది. ఈ క్రమంలో ఎవరికి వారు ఇష్టారాజ్యంగా విచ్చలవిడిగా ఫొటోలు, వీడియో సందేశాలను ఎక్కువ మంది కి పంపేందుకు వీలుగా వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసుకుంటున్నారు. స్నేహితులు తమ తమ ఆలోచనలకు అనుగుణంగా.. ప్రభుత్వ ప్రైవేట్ సంస్థల అధికారులు, ఉద్యోగులు పరి పాలన సౌలభ్యం కోసం, త్వరితగతిన సమాచార మార్పిడి కోసం వాట్సప్ గ్రూపులను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇక కొందరైతే రైళ్లు, బస్సులు, దేవాలయాలు, ఫిట్‌నెస్, ధ్యానం, రియల్‌ఎస్టేట్, చిరువ్యాపారాలు, సినిమా అభిమానులు, కవులు, కళాకారులు, అపార్ట్‌మెంట్స్, కాలనీలు ఇలా ఎవరి అవసరాలకు తగ్గట్టు వారు గ్రూపులు పెడుతున్నారు. ఇలా ఒక్కొక్కరు పదుల సంఖ్యలో గ్రూపుల్లో సభ్యులుగా ఉన్నారు. ఈ గ్రూపు క్రియేటర్లు, అడ్మిన్లు గ్రూపులోకి వచ్చే ప్రతీ సందేశానికీ బాధ్యత వహించాల్సి ఉంటుంది. గ్రూపులో చేర్చుకునే ముందే అవతలి వ్యక్తికి సంబంధించిన సమాచారం తెలిసి ఉంటే అతడిని చేర్చుకోవాలో, లేదో అర్థమవుతుంది.

పాటించాల్సిన జాగ్రత్తలివే...

వాట్సప్ గ్రూపు అడ్మిన్ అనుమతి, ప్రమేయం లేకుండా గ్రూపు సభ్యులు గ్రూపులో అశ్లీల చిత్రాలు, అసభ్యకర ఫొటోలు, మనసుకు బాధ కలిగించే సందేశాలు పంపకూడదు. అలా పంపిస్తే అతడిపైనా, గ్రూపు అడ్మిన్‌పైనా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. దీనికి అడ్మినే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఆ గ్రూపునకు చెందిన లేదా ఇతర వ్యక్తులెవరైనా ఫిర్యాదు చేస్తే సమాచార చట్టం కొంద శిక్షపడే అవకాశం ఉంది. వాట్సప్, ఫేస్ బుక్‌లలో సందేశాలు, ఫొటోలు పెట్టేవారు ముందుగా వాట్సప్‌ను డౌన్‌లోడ్ చేసుకునే ముందు డిస్‌క్లైమర్‌ను అంగీకరిస్తారు. అందులోని నిబంధనల ప్రకారం వాట్సప్ సభ్యులు అడ్మినిస్ట్రేటర్ కొన్నిరకాల సందేశాలు, ఫొటోలు, వీడియోలు హోస్టు చేయడం, పోస్టు చేయడం, పోస్టు డిస్‌ప్లేలు మార్పులు, చేర్పులు అప్‌డేట్ చేయడం, షేక్ చేయడం నిషేధం. అధికారికంగా మరో వ్యక్తికి చెందినవి, ఇతరులకు ఇబ్బంది కలిగించే అసభ్యకరమైన అశ్లీలతో కూడిన ఓ మతం, వర్గం, వర్ణం, కులం, జాతులను కించపరిచే పోస్టులు, రెండు వర్గాల మధ్య వైరుధ్యాలు, రెచ్చ గొట్టేవి, మైనర్లకు హానికరంగా పరిగణించేవి, శాంతి భద్రతలు, ప్రజా జీవితాలకు భంగం కలిగించేవి, దేశ, జాతి, రాష్ట్ర, ప్రాంతీయ సమగ్రతకు ముప్పుగా మారే పుకార్లు, కేసుల దర్యాప్తునకు ఆటంకంగా మారేవి, వ్యక్తుల గ్రూపులను లక్ష్యంగా చేసుకుని బెదిరింపులు, హెచ్చరికలు వంటి వాటిపై నిషేధం ఉంది.

ఫిర్యాదులు వస్తే కేసులు నమోదు చేస్తాం



వాట్సప్ గ్రూపుల్లో ఉండే ఇతర సభ్యులకు ఇబ్బంది కలిగించేలా పోస్టులు పంపిన వ్యక్తిపై ఎవరైనా ఫిర్యాదుచేస్తే ఖచ్చితంగా చర్యలు తీసుకుంటాం. మనోభావాలను దెబ్బ తీసేలా, మత విద్వేశాలను రెచ్చగొట్టేలా, ఎవరినైనా కించపరిచేలా సందేశాలు పెట్టినా, అశ్లీల చిత్రాలు, వీడియోలు, మాటలు పంపినా.. రుజువులతో ఫిర్యాదు చేస్తే అలాంటి వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

- అంబటి నర్సయ్య, ఏసీపీ, వర్ధన్నపేట

ఆ నలుగురు.. కరువవుతున్నరు!

మారుతున్న ఆఖరిమజిలీ తీరు

- పాడె మోసేవారు లేక వైకుంఠరథాల్లో అంతిమయాత్రలు
- ఆచారవ్యవహారాలను అంతగా పట్టించుకోని నేటితరం


వెంకటాపూర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు అయిన వారు ఎవరైనా చనిపోతే సప్త సముద్రాలు దాటైనా వచ్చేవారు.. ఇప్పుడు కడసారి చూపునకు సప్తసముద్రాలు దాటడం మాట దేవుడెరుగు, కనీసం గడపదాటకుండానే మాయదారి సెల్‌ఫోన్లలోనే చివరి అంత్యక్రియల తంతును వీక్షిస్తున్నారు. ఆధునిక సాంకేతికత.. రక్త సంబంధాలను కూడా తెంచేసుకునే పరిస్థితి తెస్తోంది. చివరకు పల్లెల్లో కూడా ఎవరైనా చనిపోతే పాడెకట్టే వారు లేరు.. మోసేందుకు ఆ నలుగురు లేక వైకుంఠ రథాల్లోనే శ్మశానవాటికకు తీసుకెళ్తున్నారు. అయిన వారేమో ఫోన్లలోనే కన్నీరు కారుస్తున్నారు.

నాడు.. నేడు..

గతంలో తమవారు ఎవరైనా చనిపోతే అందరూ పనులు మానుకుని అంత్యక్రియలు పూర్తయ్యేవరకు అన్నం కూడా తినకుండా పస్తులు ఉండేవారు. గ్రామాలు, పట్టణాల్లో ఉన్న బంధువులకు, స్నేహితులకు విషయం తెలియాలంటే ప్రత్యేకించి ఒక మనిషిని పంపి సమాచారం తెలిపేవారు. ఇంటి చుట్టు పక్కల ఎవరికైనా ఫోన్ ఉంటే దాని ద్వారా తెలిపే వారు. దగ్గరి బంధువులు వచ్చేవరకు అంత్యక్రియలు చేసేవారు కూడా కాదు. శవాన్ని మోసేందుకు కట్టెలతో పాడె కట్టేవారు. డప్పుచప్పుళ్లతో అంత్యక్రియలు ఘనంగా నిర్వహించేవారు. గంగిరెద్దులను ఆడిపించేవారు. బంధువులు, స్నేహితులు శ్మశానవాటిక వరకు పాడెను మోసుకెళ్లేవారు. అంత్యక్రియలు ముగిశాక గ్రామ శివారుల్లో ఉన్న చెరువులు, కుంటల వద్ద స్నానాలు చేసేవారు. కానీ నేడు అవేవీ కానరావడం లేదు.


అంత్యక్రియల్లో డప్పు వాయిస్తున్న కళాకారులు (ఫైల్)


పాడెపై మోసుకెళ్తున్న దృశ్యం (ఫైల్)



వైకుంఠ రథం (ఫైల్)

శవం వద్ద కుటుంబీకులు మాత్రమే ఉంటున్నారు. నేటి తరం వారైతే ఆచార వ్యవహారాలను అంతగా పట్టించుకునే పరస్థితి కనిపించడం లేదు. మొత్తం ఫోన్‌లో సమాచారం ఇస్తుండటంతో దూరంలో ఉన్న బంధు వులు కూడా గంటల వ్యవధిలో వచ్చి ఆఖరి చూపు చూస్తున్నారు. పాడె కట్టేవారు లేక.. వైకుంఠరథాల్లో అంతిమ యాత్రగా శ్మశాన వాటికలకు తీసుకెళుతున్నారు. ఇక ఇప్పుడు ప్రతీ గ్రామంలో ఆధునిక వైకుంఠధామాలు ఉండటం, అక్కడే స్నానపుగదులు, మరుగుదొడ్లు ఇతర సౌకర్యాలు కల్పించడంతో అన్నీ అక్కడే జరిగిపో తున్నాయి. పట్టణాల్లో అయితే కట్టెలతో కాల్చే పని కూడా లేకుండా విద్యుత్ దహన వేదికలు అందుబాటులోకి వచ్చాయి. విదేశాల్లో ఉండే వారైతే అప్పటికప్పుడు స్వదేశానికి రాలేక వీడియో కాల్స్‌లో తమవారిని చివరి చూపు చూస్తూ కన్నీరు కారుస్తున్న సందర్భాలున్నాయి. పరిస్థితులున్నాయి.

వైకుంఠధామం



ఆడబిడ్డల పిండి వంటకాలేవీ?

ఓ వ్యక్తి చనిపోతే ఆ ఇంటి ఆడబిడ్డ మూడు రోజుల పాటు ఆ ఇంట్లోనే ఉండి తీరొక్క వంటకాలు చేసి తమ కుటుంబీకులకు వండి పెట్టేవారు. ఆ తర్వాతే బంధువులు, స్నేహితులు రోజుకొకరు బాధిత కుటుంబం వారికి వంటకాలు చేసి పెడతారు. దినవారాలు పూర్తయ్యే వరకు అది కొనసాగుతుంది. ఇక దశదినకర్మ పూర్తయ్యేవరకు బంధువులు చనిపోయి న వ్యక్తి కుటుంబీకులకు చేదు విడిపించడం తెలంగాణ ప్రజల ఆనవాయితీ. ఇప్పుడివన్నీ కానరావడం లేదు.

ఒగ్గోళ్ల రాగాలు ఏమాయె?

దశదినకర్మ రోజున చనిపోయిన వ్యక్తి పేరును గుర్తుకు చేస్తూ ఒగ్గోళ్లతో రాగాలు పలికించేవారు. కథ చెబుతుంటే అందరూ ఒక్కచోట చేరి కథను చూసేవారు. కథ చెబుతుంటే కొంతమంది ఏడ్చేవారు. నేడు ఆ రాగాలు కనుమరుగయ్యాయి.

భజనలు, ఒగ్గు కథలు చెప్పించేవారు



నాడు ఎవరైనా చనిపోతే అంత్యక్రియలకు జనాలు ఎక్కువ వచ్చేవారు. అప్పుడు ఉన్న ప్రేమలు ఇప్పుడు కనిపించడం లేదు. చివరకు శవాన్ని పాడెపై తీసుకెళ్లే వారు కూడా లేరు. రాత్రివేళల్లో భజనలు, ఒగ్గుకథలు చెప్పించే వారు... ప్రస్తుతం అవేవీ లేవు. చుట్టాలు, స్నేహితులు ఇలా వచ్చి అలా వెళుతున్నారు. వైకుంఠదామాలు వచ్చిన తర్వాత అన్ని సౌకర్యాలు ఉండటంతో.. చెరువులు, కుంటల వద్ద స్నానాలు చేసే పరిస్థితులు పోయాయి.

- జనగాం రామస్వామి, నల్లగుంట

అంతంత 'మాత్ర'మే..

ఏజెన్సీ ప్రాంత పీహెచ్‌సీల్లో జలుబు, దగ్గు మందులు కరువు



వాజేడు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో వైద్య సేవలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. మన్యప్రాంతంలో సీజనల్ వ్యాధులు ప్రబలడం సహజం. వీటి బారిన పడే వారికి సకాలంలో వైద్యం అదకపోవడమే కాకుండా కనీసం సరైన మందులు కూడా అందుబాటులో ఉండటం లేదనే తెలుస్తోంది. జలుబు, దగ్గుతో బాధపడే వారికి సైతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మాత్రలు కరువయ్యాయనే విమర్శలు ఉన్నాయి. దీంతో ఇక్కడి వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జలుబు, దగ్గుకు మందులు అందుబాటులో లేకపోవడంతో ముఖ్యంగా పసి పిల్లలు, వృద్ధులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. జలుబు చేస్తే వారం రోజుల పాటు ఉండే అవకాశం ఉండటంతో ఏ పని చేసుకోవడానికి కూడా జనాలకు వీలుండే పరిస్థితి ఉండదు. జలుబును తగ్గించి ఉపశమనం ఇచ్చే మాత్రలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో కరువు కావడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక జనం అల్లాడుతున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో జలుబు, దగ్గు మందుల నిల్వలు నిండుకున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయిలో రావాల్సిన మందులు సగం కంటే తక్కువగానే వస్తున్నట్లు సమాచారం. జిల్లా వ్యాప్తంగా ఉన్న పీహెచ్‌సీలలో ఇదే పరిస్థితి ఉందనే విమర్శలు ఉన్నాయి. నెలనెలా పంపించే మెడిసిన్‌ను సగం కంటే తక్కువగా వస్తుండటంతో వైద్యులు వచ్చిన మాత్రలతోనే రోగులకు సరిపెట్టాల్సి వస్తోందని సమాచారం. ఇందుకు వాజేడు పీహెచ్‌సీ దుస్థితే నిదర్శనం. ఈ ఆరోగ్య కేంద్రం పరిధిలో సుమారు 13 వేల మంది జనాభా ఉన్నారు. ప్రతి నెల సుమారు 6,500 మందులు ఇక్కడికి రావాల్సి ఉంది. జలుబు, దగ్గు మందులు ప్రస్తుతం సుమారు 2,500లోపే సరఫరా చేస్తుండటంతో వచ్చిన వాటిని ఎటూ సరిపోవడం లేదని తెలుస్తోంది. ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరులోనైతే కనీసం ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా లేని పరిస్థితి ఉండేది. ప్రస్తుతం జ్వరాల సీజన్ తగ్గి జలుబు, దగ్గు పెరగటంతో వాటి మందుల కొరత తీవ్రంగా ఉందని తెలుస్తోంది. ఒక రోగికి కనీసం మూడు నుంచి నాలుగు రోజుల పాటు మాత్రలు అందించాల్సి ఉండగా రెండు రోజులకు సరిపడేవి కూడా ఇచ్చే పరిస్థితి లేదనే విమర్శలు వస్తున్నాయి. ఈ క్రమంలో రోగులు ప్రైవేటు మందుల షాపులకు వెళ్లి మాత్రలను తెచ్చుకోవాల్సి వస్తోందని తెలుస్తోంది. వైద్య రంగాన్ని బలోపేతం చేస్తున్నామని ఒక వైపు ప్రజాప్రతినిధులు చెబుతుండగా క్షేత్రస్థాయిలో అలాంటి పరిస్థితులు కనిపించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. పీహెచ్‌సీలలో దీర్ఘకాలిక రోగాలకు మందులు అందుబాటులో ఉన్నప్పటికి సీజనల్‌గా వచ్చే జలుబు, దగ్గు, జ్వరాలకు మందులు సరిగా లేకపోవడ విమర్శలకు తావిస్తోంది.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

ములుగు కలెక్టర్ దివాకర



కీడల ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు స్వశక్తితో క్రీడల్లో రాణించి జాతీయ స్థాయిలో మంచి పేరును గడివంచాలని కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. ములుగు మండలంలోని జాకారం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల క్రీడా మైదానంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, జిల్లా క్రీడల అధికారి తుల రవితో కలిసి సీఎం కప్ క్రీడలను కలెక్టర్ మంగళవారం ప్రారంభించారు. అనంతర మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడల్లో రాణించినప్పుడే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని అన్నారు. గ్రామ, మండలస్థాయి క్రీడల్లో రాణించి జిల్లాస్థాయి క్రీడలకు ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపిక కావాలన్నారు. జిల్లాస్థాయి కబడ్డీ, హ్యాండ్‌బాల్, అథ్లెటిక్స్, యోగా, కిక్ బాక్సింగ్ క్రీడల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. క్రీడాకారుల కోసం ఎంత ఖర్చయినా వెచ్చించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ మాట్లాడుతూ క్రీడల వల్ల దేహదారుఢ్యం, క్రమశిక్షణ అలవడుతుందన్నారు. క్రీడల్లో అందరూ ఉత్సాహంగా పాల్గొనాలని అన్నార ఈ కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు పైడాకుల అశోక్, తొమ్మిది మండలాల ఎంపీడీవోలు, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

తమ్ముడి మరణాన్ని తట్టుకోలేక అన్న ఆత్మహత్య

మహదేవపూర్ రూరల్, డిసెంబరు 17 : తమ్ముడి మరణాన్ని తట్టుకోలేక అన్న ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని బెగ్లూర్ గ్రామంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పొట్లపెల్లి మధున య్య(34) తమ్ముడు రామచంద్రం మూడు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. తమ్ముడిని తరుచూ తలచుకుంటూ మనస్తాపం చెందిన మధునయ్య మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం తన ఇంటి వెనకాల ఉన్న పందిరికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య మహేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభిం చినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

భూపాలపల్లి కృష్ణకాలనీ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడిన సంఘటన భూపాలపల్లి పట్టణంలోని గణేష్‌చౌక్ వద్ద మంగళవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి పట్టణంలోని రాజీవ్ నగర్‌కాలనీకి చెందిన ఎండీ మంజూర్ అంబేద్కర్ కూడలి నుంచి తన ద్విచక్ర వాహనంపై బాంబులగడ్డ వైపు వెళ్తుండగా గణేష్‌చౌక్ వద్ద ఆగి ఉన్న బస్సు పక్క నుంచి వెళ్లే ప్రయత్నం చేశాడు. దీంతో వెనకాలే వచ్చిన లారీ ఓవర్‌టేక్ చేస్తుండగా బస్సు, లారీ మధ్యలో మంజూర్ ఇరుక్కుపోయి కిందపడిపోగా కాలికి గాయాలయ్యాయి. స్థానికులు అతడిని పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

విస్తృతంగా ముందస్తు అరెస్టులు

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడికి తరలివెళ్తున్న పీడీఎస్‌యూ నేతలను ములుగు పోలీసులు మంగళవారం అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో పూర్వ పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ముంజాల భిక్షపతిగౌడ్ సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్, రఘు, రవి ఉన్నారు.

రెండో ఏఎన్ఎంలు

చిట్యాల (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తత అసెంబ్లీ ముట్టడికి సిద్ధమవుతున్న మండలంలోని పలువురు ఏఎన్ఎంలను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం తెల్లవారు జామున పోలీస్ స్టేషన్‌కు తరలించి, సొంత పూచీకత్తుపై సాయంత్రం విడుదల చేశారు. అరెస్టు అయిన వారిలో సుమలత, పద్మ, స్వరూప తదితరులు ఉన్నారు.

దళిత నాయకులు

మంగపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): దళిత బంధు పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ వద్ద నిరసనకు సిద్ధమైన దళిత నేతలను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో దళిత బంధు రాష్ట్ర కన్వీనర్ చిట్టిమల్ల సమ్మయ్య, పూసాల నర్సింహారావు, గాందేర్ల నర్సింహారావు, మూగల రాము, దర్గం యాకాంతం, పగిడిపెల్లి సూరిబాబు తదితరులు ఉన్నారు.

గ్రామపంచాయతీ సిబ్బంది

ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చలో అసెంబ్లీ కార్యక్రమానికి బయల్దేరేందుకు సిద్ధమైన గ్రామ పంచాయతీ సిబ్బందిని ఏటూరునాగారం పోలీసులు ముందుస్తు అరెస్టు చేశారు.

యువకులకు కౌన్సెలింగ్

కాటారం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గంజాయి నియంత్రణలో భాగంగా కాటారం పోలీస్ స్టేషన్‌లో గతంలో గంజాయి కేసులతో సంబంధం ఉన్న యువ కులకు ఎస్సై అభినవ్ మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. గంజాయి సరఫరా చేసిన, సేవించిన, విక్ర యించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి, డ్రగ్స్‌కు బానిసలై ఉజ్వలమైన భవి ష్యత్‌ను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. గంజాయిపై ప్రత్యేక నిఘా ఉంచామని, కేసుల్లో ఉన్నవారిపై షీట్స్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు.

జాతీయ వాలీబాల్ జట్టుకు ఎంపిక



ప్రణయ్

వెంకటాపూర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన వాలీబాల్ ప్లేయర్ (బూస్టర్) రామిడ్ల రాజేందర్ కుమారుడు ప్రణయ్ సౌత్‌జోన్ నేషనల్ వాలీబాల్ జట్టుకు ఎంపికయ్యాడు. కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురంలో ఈనెల 18 నుంచి 22 వరకు జరిగే నేషనల్ వాలీబాల్ పోటీల్లో ప్రణయ్ ఉస్మానియా విశ్వవి ద్యాలయం జట్టు తరపున పాల్గొననున్నారు. హైదరాబాద్ నిజాం కళాశా లలో డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న ప్రణయ్ ఈనెల 10,12 తేదీల్లో జరిగిన ట్రయల్స్‌లో ప్రతిభ కనబరిచి ఉస్మా నియా విశ్వవిద్యాలయం తరపున నేషనల్ ఎంపికయ్యారు.

ఆలయాల్లో ధనుర్మాస పూజలు

మంగపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా బోరునర్సాపురం, కమలాపురం, తిమ్మంపేట, చెరుపల్లిలోని దేవాలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. గోదాదేవి అమ్మవారి ఉత్సవ మూర్తు లకు పట్టు వస్త్రాలు, పూలమాలలతో సుందరంగా అలంకరించి భక్తులకు అర్చకులు దైవ దర్శనాలు గావించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంత రం అండాళ్, తిరువడిమలే కార్యక్రమాలను నిర్వహించారు. ధనుర్మాస వేడుకలు రామాల యాల్లో నిర్వహిస్తుండడంతో భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. ఆయా గ్రామాల ప్రముఖులు, వివిధ వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అక్రమ దత్తత నేరం : జిల్లా సంక్షేమ అధికారి

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పిల్లల అక్రమ దత్తత నేరమని సంక్షేమ శాఖ జిల్లా అధికారి కూచన శిరీష అన్నారు. ములుగులోని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో ఐసీడీఎస్ సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, మహిళా సాధికారత కేంద్రం, భరోసా సిబ్బందికి బాలల పరిరక్షణ అధికారి ఓంకార్ అధ్యక్షతన మంగళవారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పిల్లలు లేనివారికి దత్తత ఓ వరంలాంటిదని అన్నారు. సరైన అవగాహన లేక కొందరు బయటినుంచి పిల్లలను దత్తత తీసుకోవడం లేదా కొనడం చేస్తారని, ఇది చట్ట విరుద్ధమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని సీడీపీవోలు ఈపీ.ప్రేమలత, ధనలక్ష్మి, విజయలక్ష్మి, వివిధ సెక్టార్ల సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో

మంగపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని డీఈవో జి. పాణిని మంగళవారం సాయంత్రం తనిఖీ చేశారు. విద్యార్థినులకు అందుతున్న భోజనం, స్నాక్స్ ఏర్పాట్లు, కిచెన్, నిత్యావసర సరుకులు, కూరగాయల నాణ్యతతోపాటు పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. మెనూను కచ్చితంగా పాటించాలని, లేదంటే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఈవో వెంట ఎంఈవో పొదెం మేనక, ఉపాధ్యాయులు ఉన్నారు.

తాడ్వాయిలో ఎంఈవో..

తాడ్వాయి (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని స్థానిక మండల విద్యాశాఖ అధికారి రేగ కేశవరావు ఆకస్మికంగా పరిశీలించారు. విద్యార్థినులకు అందిస్తున్న భోజన పదార్థాలను పరిశీలించారు. నాణ్యమైన ఆహార పదార్థాలు అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. అనంతరం విద్యార్థినుల ఆరోగ్య విషయాలు, విద్యాబోధన, ఆహారం, క్రీడలు, తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట ఉపాధ్యాయురాలు బుర్ర రజిత ఉన్నారు.

గ్రామాల్లో ఇంటింటి ఫీవర్ సర్వే

వెంకటాపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చొక్కాల, వీఆర్కేపురం, రంగరాజపురం గ్రామాల్లో వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఎంత మంది కుటుంబ సభ్యులు ఉన్నారు, వారిలో ఎవరైనా జ్వరంతో బాధపడుతున్నారా అనే విషయాలను ఆరా తీశారు. అనంతరం వైద్యశిబిరాలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు స్నేహ, పవన్, జ్యోతి, మనోహర్, డీపీఎంవో సత్యనారాయణ, హెచ్‌వీ రవి, తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథపురంలో..

వాజేడు (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగన్నాథపురంలో వాజేడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టరు అల్లి మధుకర్ ఆధ్వర్యంలో ఇంటింటి మలేరియా సర్వే నిర్వహించారు. క్షయ బాధితులను పరీక్షించారు. సోమవారం మృతిచెందిన మూడేళ్ల బాలుడి కుటుంబాన్ని పరామర్శించి రిపోర్టులను పరిశీలించారు. బాలుడి తల్లి, నానమ్మలకు నీరసంగా ఉండటంతో ఇంటి వద్ద సెలైన్ ఎక్కించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎస్‌వో కోటిరెడ్డి, వెంకటరమణ, ఏఎన్ఎం సత్యనాగవేణి, హెచ్ఏ శేఖర్, ఆశా కార్యకర్తలు నాగలక్ష్మి, నాగమణి, అక్కమ్మ, సరిత పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన

వాజేడు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): వన్యప్రాణుల సంరక్షణపై అటవీ శాఖ అధికారులు మంగళవారం అవగాహన కల్పించారు. మండలంలోని కోయవీరాపురంలో గ్రామస్థులకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. వన్యప్రాణుల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అడవుల్లో నిప్పు పెట్టడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. దీంతో జంతు, వృక్ష సంపద నాశనమవుతుందన్నారు. తునికాకు, ఇప్పపూల సేకరణకు కోసం అడవులకు నిప్పు పెట్టరాదని సూచించారు. జంతువులను వేటాడం కోసం కరెంటు ఉచ్చులు అమర్చితే కేసుల పాలవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో నారాయణ, ఎఫ్‌బీవోలు మనీషా, పద్మ, సాయిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఏటూరునాగారం రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో ఉన్న ఐటీడీఏ పరిధిలోని గిరిజన నిరుద్యోగ యువతల్లో నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ నాలెడ్జ్ సంస్థ(టాస్క్) ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంత నిరుద్యోగ గిరిజన యువతకు ఇంటర్వ్యూలు, ఆత్మవిశ్వాసం, వ్యక్తిగత సామర్థ్యం, బృందాలను నడిపించ గల నైపుణ్యంపై ఉచితంగా పది రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పీజీ, డిగ్రీ, డిప్లొమా, ఎంబీఏ, బీటెక్ పూర్తి చేసినవారు అర్హులని, ఈనెల 21లోగా ఐటీడీఏ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 9490341911, 8008932159 నంబర్లను సంప్రదించాలని ఆమె పేర్కొన్నారు.

జాదరావుపేట జీపీని సందర్శించిన డీఎల్‌పీవో

కాటారం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి):మండలంలోని జాదరావుపేట గ్రామపంచాయతీ పరిధిలో డీఎల్‌పీవో వీరభద్రయ్య మంగళవారం పర్యటించారు. జీపీ కార్యాలయంలో పలు రికార్డులను తనిఖీ చేశారు. పల్లె ప్రగతి పనులను పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణ పనులు నిరంతరం విరివిగా చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి శివకుమార్‌ను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే సకాలంలో పూర్తి చేయాలన్నారు. జీపీ పరిధిలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. ఆయన వెంట కార్యదర్శి శివకుమార్, జీపీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

గొర్లవీడులో ఇందిరమ్మ సర్వే

భూపాలపల్లి కృష్ణకాలనీ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి మండలంలోని గొర్లవీడు గ్రామంలో ఇందిరమ్మ ఇంటింటా సర్వే కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి కోటి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగ్గా కారోబార్ రాజవీరు, సిబ్బంది పాల్గొన్నారు.

టీటీడీ అఖండ సంకీర్తనలో కాటారం మహిళలు

కాటారం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి):శ్రీ తిరుమల-తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో జరిగే అఖండ హరినామ సంకీర్తనలో పాల్గొని భజన చేసే భాగ్యం కాటారం మండలకేంద్రానికి చెందిన మహిళలకు దక్కింది. గారెపల్లి వాసవి భజన మండలి సభ్యులకు టీటీడీ ద్వారా జరిగే హరినామ సంకీర్తనలో పాల్గొనాలని సమాచారం అందింది. దీంతో మూడు రోజుల క్రితం తిరుమల వెళ్లిన తామంతా రెండుసార్లు శ్రీహరి పాదాల చెంత అఖండ హరినామ సంకీర్తనలో పాల్గొన్నామని భజనమండలి సభ్యులు మంగళవారం తెలిపారు. అఖండహరి నామ సంకీర్తనలో పాల్గొనే అవకాశం దక్కడం సంతోషంగా ఉందని బృందం సభ్యులు తెలిపారు. సంకీర్తనకు వెళ్లిన వారిలో వసంతలక్ష్మి, అరుణ, అనిత, నీరజ, శ్రీదేవి, శోభ, శోభారాణి, అంజలి, శ్రీలక్ష్మి, ఆశా, భువనేశ్వరి, కల్పన, పద్మ, లహరి, స్వరూప, సరిత ఉన్నారు.


ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పి.రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.తిరుపతి మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత పది రోజులుగా సమగ్ర శిక్షా ఉద్యోగులు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని విమర్శించారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించి పర్మనెంటు చేయాలని పేర్కొన్నారు.

ధాన్యం సేకరణ వేగవంతం చేయాలి

కాటారం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సివిల్ సప్లయ్ డీఎం రాములు, డీసీవో వాల్యానాయక్ నిర్వాహకులను ఆదేశించారు. మండలంలోని కొత్తపల్లి, గారెపల్లి, శంకరంపల్లి, ధన్వాడ ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీఎం, డీసీవోలు మంగళవారం తనిఖీ చేశారు. ప్యాడీ క్లీనర్ల ద్వారా శుభ్రం చేసి తేమ శాతం 17వరకు ఉన్న వడ్లను ఎప్పటికప్పుడు కాంటాలు చేసి బస్తాలను మిల్లులకు తరలించాలని ఆదేశించారు. తూకం వేసిన వడ్ల బస్తాలను మళ్లీ కాంటా చేయించి 200గ్రాములు తక్కువగా ఉండడాన్ని గుర్తించారు. సరైన తూకం వేయాలని హమాలీలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో ఎడ్ల సతీష్, సిబ్బంది గోపాల్, అమీన్, రాజబాపు తదితరులు పాల్గొన్నారు.

అడవిని తలపిస్తున్న నర్సరీ



నర్సరీలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

మల్హర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లారంలోని ఫారెస్టు నర్సరీ అడవిని తలిపిస్తోంది. గతంలో కంపా, ఈజీఎస్ నుంచి నిధులు రావడంతో వివిధ రకాల మొక్కలను ఇందులో పెంచారు. గత ఏడాది నుంచి నిధులు ఆగి పోవడంతో పాటు అధికారుల పర్యవేక్షణ కరువు కావడంలో నర్సరీలోని మొక్కలు కాస్త చెట్లుగా మారిపోయాయి. లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన నీటి ట్యాంకులు, సోలార్ ప్యానళ్లు, పైప్‌లైన్లు దెబ్బతిన్నాయి. అలాగే నీటిని నిల్వ చేసేందుకు వినియోగించే నీటి తొట్టెలు పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. ప్రస్తుతం నర్సరీని కాపాడుతున్న వారికి కూడా జీతాలు రాని పరిస్థితి ఉందని అధికారులు తెలుపుతున్నారు. ఇందులో ప్రస్తుతం వందకు పైగా వివిధ రకాలు మొక్కలు, చెట్లు చెత్తాచెదారం నడుమ ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

ఎమ్మెల్యే నాయినికి ఉపసభాపతి?

ఉమ్మడి జిల్లా నుంచి మరో కీలక పదవి

వరంగల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి శాసనసభ ఉపసభాపతి పదవి దక్కే అవకాశాలున్నాయనే ప్రచారం జరుగుతోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత అటు పార్టీ వ్యవహారాలతో పాటు అసెంబ్లీలో విపక్షాల తీరును ఎండగడుతూ సమర్థంగా ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల్లో నాయిని మొదటి వరుసలో ఉన్నట్టు కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తోంది. పాతికేళ్లకు పైగా కాంగ్రెస్‌లో వివిధ పదవులు నిర్వహించి, 11ఏళ్లకు పైగా డీసీసీ అధ్యక్షుడిగా పని చేసిన నాయిని రాజేందర్‌రెడ్డికి పార్టీ పట్ల ఉన్న విధేయతకు తగిన గుర్తింపు ఇవ్వాలని అటు అధినాయకత్వం.. ఇటు సీఎం యోచిస్తున్నట్టు సమాచారం. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఎన్నికైన ఎమ్మెల్యేల్లో చాలా మంది వివిధ పార్టీలు నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చినవారే అధికంగా ఉన్నారు. ఇప్పటికే ఎస్టీ, బీసీ వర్గాల నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఇద్దరు మహిళలను మంత్రి వర్గంలోకి తీసుకున్నారు. ఎస్సీ, ఓసీ ఎమ్మెల్యేలకు అవకాశం ఇవ్వాల్సి ఉందనే చర్చ జరుగుతున్న నేపథ్యంలో స్పీకర్‌గా ఎస్సీ సామాజిక వర్గం నుంచి గడ్డం ప్రసాద్ ఉండటంతో డిప్యూటీగా ఓసీ సామాజిక వర్గం నుంచి నాయినికి అవకాశం ఇచ్చే అవకాశాలున్నాయనే చర్చ జరుగుతోంది. తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ విపక్షాలను ఎదుర్కొనడంలో మంత్రులకు దీటుగా రాజేందర్‌రెడ్డి దూకుడుగా వ్యవహరిస్తుండటంతో డిప్యూటీ సీట్లో కూర్చోబెట్టడం ద్వారా ఆయనకు సరైన గౌరవం ఇచ్చినట్టవుతుందని, అదే క్రమంలో ప్రతిపక్షాలను నియంత్రించవచ్చనే ఆలోచనలో కాంగ్రెస్ పెద్దలున్నట్టు ప్రచారం జరుగుతోంది. స్పీకర్‌గా అధికార పార్టీ నుంచి గడ్డం ప్రసాద్‌కుమార్ ఉండగా, డిప్యూటీ స్పీకర్ పదవిని ప్రతిపక్షం నుంచి బీఆర్ఎస్‌కు కేటాయించాలని ఆ పార్టీ డిమాండ్ చేస్తోంది. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో డిప్యూటీ స్పీకర్ పదవిని విపక్షాలకు కేటాయించే అనవాయితీని పాటించలేదని, దీంతో కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో ఒకరికి డిప్యూటీ పదవి ఇవ్వాలని అధికార పార్టీ నిర్ణయించినట్టు సమాచారం. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాకు కేంద్రంగా ఉన్న వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి డిప్యూటీ స్పీకర్ పదవి దక్కే అవకాశాలున్నాయని సమావేశం. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి సైతం నాయినికి డిప్యూటీ స్పీకర్ పదవి పట్ల సుముఖంగా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. నాయిని విషయంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఒకరిద్దరు ఎమ్మెల్యేలు మినహ మిగతా వారంత కూడా సానుకూలంగానే ఉన్నారనే చర్చ జరుగుతుంది.

చీఫ్‌విప్ లేదా వర్కింగ్ ప్రెసిడెంట్‌పై నాయిని నజర్

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని డిప్యూటీ స్పీకర్ సీట్లో కూర్చోపెట్టాలని ప్రభుత్వ పెద్దలు భావిస్తుంటే.. రాజ్యాంగబద్ధమైన పదవిలో కూర్చోపెట్టి తన మాటలను కట్టడి చేయవద్దని నాయిని అధిష్ఠానం వద్ద విజ్ఞప్తి చేస్తున్నట్టు తెలుస్తోంది. సుదీర్ఘకాలం కాంగ్రెస్ రాజకీయాల్లో ఉన్నానని, ప్రస్తుతం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత రాజ్యాంగ పదవిలో ఉంటే ప్రతిపక్షాలపై విమర్శలు చేయటం కుదరదని, నాయిని తన సన్నిహితుల వద్ద చెబుతున్నట్టు తెలిసింది. అవకావం ఉంటే తనకు మంత్రి వర్గంలో చాన్స్ ఇవ్వాలని సీఎంను కోరినట్టు తెలిసింది. ఒకవేళ మంత్రి వర్గంలో అవకాశం రాలేకపోతే శాసనసభలో ఖాళీగా ఉన్న చీఫ్‌విప్ పదవిని ఇస్తే బాగుంటుందని తన సన్నిహితుల వద్ద నాయిని ప్రస్తావించారని సమాచారం. ఇదికూడా కుదరకపోతే రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గానైనా అవకాశం ఇవ్వాలని అధిష్ఠానాన్ని కోరుతున్నట్టు తెలిసింది.

నెల రోజుల క్రితం ఢిల్లీకి వెళ్లిన నాయిని రాజేందర్‌రెడ్డి తనకు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇవ్వాలని ఏఐసీసీ పెద్దలను కలిసి విజ్ఞప్తి చేసి వచ్చినట్టుగా సమచారం. ప్రభుత్వ పదవులకంటే పార్టీ పదవుల వైపే నాయిని రాజేందర్‌రెడ్డి మొగ్గు చూపుతున్నట్టు ఆయన సన్నిహితులు కూడా చెప్పుతున్నారు. చీఫ్‌విప్ లేదా వర్కింగ్ ప్రెసిడెంట్ పదవులుంటే రాజకీయంగా మరింతా క్రియాశీలకంగా, ప్రజలకు దగ్గరగా ఉండే అవకాశం ఉంటుందని నాయిని భావిస్తున్నట్టు సమాచారం. ఈ నెల 21వ తేదీ వరకు అసెంబ్లీ సమావేశాలు జరుగనున్నాయి. ఈ సమావేశాల అజెండాలో డిప్యూటీ స్పీకర్ ఎన్నిక లేదు. దీంతో ఒకవేళ డిప్యూటీ స్పీకర్ పదవే అయితే బడ్జెట్ సమావేశాలు జరిగే ఫిబ్రవరి వరకు అగాల్సిందే. చీఫ్‌విప్ లేదా వర్కింగ్ ప్రెసిడెంట్ పదవులైతే మాత్రం జనవరిలో ప్రకటించే అవకాశం ఉందనే ప్రచారం ఉంది. ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పని చేసిన అనుభవం ఉండటంతో నాయినికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సన్నిహితులున్నారు. దీంతో వరంగల్ పశ్చిమ ఎమెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి రాజ్యాంగ బద్ధమైన డిప్యూటీ స్పీకర్ పదవి దక్కుతుందా లేదా తాను కోరుకుంటున్న చీఫ్‌విప్ లేదంటే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవుల్లో ఏది దక్కుతుందనే దానిపై ఓరుగల్లు కాంగ్రెస్ కేడర్‌లో ఆసక్తికర చర్చ జరుగుతోంది.

కుంభకోణం.. కలకలం

(5వ పేజీ తరువాయి)

అయి ఉన్న స్లాట్స్‌ను సైతం క్యాన్సల్ చేయ దంతో పాటు పూర్తయిన రిజిస్ట్రేషన్లపై చర్యలు తీసుకునే విధంగా లేఖలో పేర్కొన్నట్లు తెలి సింది. భూముల రిజిస్ట్రేషన్ వ్యవహారంపై పూర్తి విచారణ చేపట్టాలని కాటారం సబ్ కలె క్టర్ మయాంక్ సింగ్‌ను కలెక్టర్ సోమవారం రాత్రి ఆదేశించడంతో మంగళ వారం విచారణ ప్రారంభమైంది. కాగా తహసీల్దార్‌తో పాటు రిజిస్ట్రేషన్ల ప్రక్రి యలో కార్యాలయ సిబ్బంది పాత్ర ఉందనే ఆరోపణలు సైతం వెల్లువెత్తు న్నాయి. ఇదిలా ఉంటే ధరణిలోకి ఆ వ్యక్తుల పేర్లు ఎక్కించిన అప్పటి తహసీల్దార్ సహా సిబ్బంది వివరాలు సైతం సేకరించినట్లు సమాచారం.

పొలిటికల్ వార్

పలిమెల శివారులోని భూములను సిమెంట్ కంపెనీకి రిజిస్ట్రేషన్ చేయడంపై మండలంలో పొలిటికల్ వార్ నెలకొంది. కాంగ్రెస్‌కు చెందిన నాయకులు దండేర రాజేందర్, విలాస్‌రావు బాధిత రైతులతో కలిసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆ వెంటనే ఆయన ఆదేశాలు జారీ చేశారు. రైతుల భూములతో చెలగాటమాడు తున్నారంటూ మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆ భూముల్లోనే మీడియా సమా వేశం ఏర్పాటు చేసి మంత్రి శ్రీధర్‌బాబుపై విమర్శలు గుప్పించారు. ఇలా అధికార, ప్రతిపక్ష నాయకులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేస్తూ చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేస్తుండటం చర్చనీ యాశంగా మారింది. దీనిపై కాంగ్రెస్ నాయకులు సైతం బుధవారం మీడియా సమావేశం పెట్టే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. కాగా 2021లో ఓ పార్టీకి చెందిన నాయకుడు ఆ బినామీ వ్యక్తుల ద్వారా ఎకరాకు రూ.2.90 లక్షలతో సిమెంటు కంపెనీకి రిజిస్ట్రేషన్ చేయించేందుకు రాయించుకున్న లేఖ ఒకటి వైరల్ అవుతోంది.

ఏదేమైనా భూకుంభకోణంపై పూర్తి స్థాయిలో విచారణ జరిగితేనే అసలు విషయం బయటకొస్తుందని రైతులు అంటున్నారు. పార్టీలు ఎలా ఉన్నా తమ భూములు తమకు రిజిస్ట్రేషన్ చేయాలనే డిమాండ్ వారి నుంచి వ్యక్తమవుతోంది.

బీఆర్ఎస్ శ్రేణుల నిరసన

మల్హర్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి) : రెండో విడత దళిత బంధు నిధులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ బీఆర్ ఎస్ నేతలు నిరసనకు దిగారు. కొయ్యూర్‌లోని దుద్దిళ్ల శ్రీపా దరావు విగ్రహనికి దళిత బంధు సాధన సమితి ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో దళిత బంధు సాధన సమితి జిల్లా అధ్యక్షుడు నౌక్ల సంపత్, జిల్లా కమిటీ ముఖ్య నాయకులు జక్క శ్రావణ్, మండల కన్వీనర్ నార రమేష్, వేల్పుల లచ్చన్న, శనిగరం సురేష్, గడ్డం పెద్ద సమ్మయ్య, వేల్పుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

• మొగుళ్లపల్లి (ఆంధ్రజ్యోతి): లగచర్ల రైతులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్‌పార్టీ నాయకులు మండల కేంద్రంలో నిరసనకు దిగారు. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బలుగూరి తిరుపతిరావు, మాజీ జడ్పీటీసీ జోరిక సదయ్య, నాయకులు బెల్లంకొండ శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• కాటారం (ఆంధ్రజ్యోతి): రుణమాఫీ నాలుగో విడత నిధులను విడుదల చేయని ప్రభుత్వం రుణమాఫీ పేరిట రైతులను మోసం చేస్తున్నదని బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి జోడు శ్రీనివాస్, యూత్ మండల అధ్యక్షుడు రామిళ్ల కిరణ్ ఆరోపించారు. మండలకేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. వేలాది కోట్ల రూపాయలతో రైతులకు 100శాతం రుణమాఫీ చేశామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్నదని విమర్శించారు వెంటనే సంబంధిత ఖాతాల్లో రుణమాఫీ డబ్బులు వేయాలని డిమాండ్ చేశారు.

• ములుగు (ఆంధ్రజ్యోతి): ఫార్మా కంపెనీల కోసం తమ భూములను బలవంతంగా లాక్కుంటున్న ప్రభుత్వాన్ని నిలదీసిన లగచర్ల రైతులకు సంకెళ్ల వేయడం అమానుషమని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. ములుగులోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతులపై పెట్టిన కేసులను తక్షణమే ఎత్తివేస్తూ అందరినీ జైలు నుంచి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ములుగు, గోవిందరావుపేట మండలాల అధ్యక్షులు పాలెపు శ్రీను, లకావత్ నర్సింహనాయక్, తదితరులు పాల్గొన్నారు.

• ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): లగచర్ల గ్రామ రైతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఏటూరునాగారంలో బీఆర్ఎస్ నాయకులు నిరసన చేశారు. తుమ్మ మల్లారెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు వావిలాల రాంబాబు, బీసీ సెల్ అధ్యక్షుడు బట్టు రమేష్, గండెపల్లి నర్సయ్య, సప్పిడి రాంనర్సయ్య, మండపల్లి చంద్రం, బూర వెంకన్న తదితరులు పాల్గొన్నారు.